క్లుప్తంగా

పేద ముస్లింలకు వైద్య సేవలు

పిట్టలవానిపాలెం: పేద ముస్లిం పిల్లలకు ఉచిత వైద్య శిబిరాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు పొన్నూరు ఫాతిమా వైద్యశాల వైద్యులు డాక్టర్ నూరుల్లా తెలిపారు. ఆదివారం చందోలు పరిధిలోని మదర్‌సా అరేబియా అతారుల్ ఉలుమ్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మే నెలలో మూడు రోజులు చందోలులో వైద్య శిబిరం జరుగుతుందని, ప్రతి నెలా ఆదివారం చిన్న మట్లపూడి, మంగళవారం పొన్నూరులో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అతహర్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ట్రస్టు సభ్యులు ఉన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

కర్లపాలెం: కర్లపాలెం శాఖ గ్రంథాలయంలో సోమవారం నుంచి 11వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారిణి టీవీ రమణమ్మ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 12గంటల వరకు కథలు వినటం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష , పెయింటింగ్, డ్యాన్స్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఉచితంగా వైద్య పరీక్షలు

కర్లపాలెం: దీర్ఘకాలిక రోగులు వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని మధుమేహ వైద్యుడు చల్లా రామోహన్‌రావు సూచించారు. రామకృష్ణ సేవా సమితి, పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు వంద మంది మధుమేహం, రక్తపోటు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రేపల్లె రూరల్: రహదారి ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని 23వ వార్డుకు చెందిన మోపిదేవి వెంకట వర్మ(21), గత నెల 22న నిజాంపట్నం నుంచి రేపల్లె వస్తుండగా బేతపూడి సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి, ప్రమాదానికి గురయ్యాడు. గుంటూరులో చికిత్స పొందుతున్న ఆ యువకుడు శనివారం మృతి చెందనిట్లు తెలిపారు. మృతుడి భార్య షబానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

9న తారకేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

బాపట్ల అర్బన్: భావపురి సూర్యలంక తీరాన రూ.3 కోట్లతో నిర్మించిన తారకేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఈ నెల 9 నుంచి 13 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు బాపట్లలో ఆదివారం విలేకర్లకు నిర్వాహకులు వివరాలు వెల్లడించారు. శృంగేరి శారదా పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి, విధుశేఖర భారతీ స్వామి సమక్షంలో పూజా క్రతువులు జరగనున్నాయని తెలిపారు. 8, 9 శతాబ్దాలకు చెందిన చాళుక్య ఆలయ వాస్తు శిల్ప నిర్మాణ రీతిలో కృష్ణ శిలలతో ఆలయాన్ని నిర్మించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇది భావపురి కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడింప చేస్తుందని ఆలయ నిర్మాణ వాస్తు శిల్పి కేవీ గోపాలకృష్ణ శర్మ పేర్కొన్నారు. సమావేశంలో మంతెన దశరథ మహారాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ అడ్డగడ సుబ్బారావు, కార్యదర్శి దెందుకూరి రవికుమార్ రాజు, సభ్యులు మంతెన రామ్మూర్తిరాజు, బూరుగుల సంగమేశ్వర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

భావన్నారాయణస్వామికి చక్రస్నానం



బాపట్ల: శ్రీ భావన్నారాయణస్వామికి తూర్పు సత్రంలో తిరుమల దినోత్సవంతో పాటు చక్రస్నానాన్ని అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. దేవాదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, భావనారాయణ స్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త వెంకటరమణబాబు, ఈఓ డీవీ వెంకటేశ్వర్లు, ఆలయ అర్చక స్వాములు పాల్గొన్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు భక్తులు స్వీకరించారు.

9నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

గాజులపేట(భట్టిప్రోలు): పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గాజులపేటలో నిర్మాణంలో ఉన్న అభయాంజనేయస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఆంజనేయస్వామికి పూజలు

జంపని(వేమూరు): జంపని గ్రామంలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక హనుమజ్జయంత్యుత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్వామివారికి నిత్య విశేష పూజా కైంకర్యాలు చేశారు. వేములపల్లి శివరామకృష్ణ, నాదెండ్ల సురేష్ బాబు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. నాగవల్లి పత్రాలు, గులాబీ పుష్పాలతో అర్చన నిర్వహించారు.

ముగిసిన బండ్లమ్మ కొలుపులు

- అమ్మవారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు
- విజయేశ్వరిదేవిగా దర్శనం



నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



విజయేశ్వరీదేవి అలంకరణలో బండ్లమ్మ

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ కొలుపులు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 3 నుంచి అమ్మవారి వార్షిక కొలుపులను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. బండ్లమ్మ అమ్మవారికి పంటలు బాగా పండాలని, వ్యాపారాలు లాభసాటిగా సాగాలని కోరుతూ ప్రజలు వందల ఏళ్లుగా పూజలు చేస్తున్నారు. ఆదివారం అమ్మవారిని నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించి, కొబ్బరి కాయలు సమర్పించారు. పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, అమ్మవారికి సమర్పించారు. డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారికి ప్రదక్షిణలు చేశారు. చెరుకుపల్లి మండలం కుంచలవారిపాలెం గ్రామం నుంచి పసుపు బండ్లు అధిక సంఖ్యలో వచ్చాయి. విద్యుద్దీపాలతో అలంకరించిన ప్రభలను దేవాలయానికి తీసుకొచ్చారు. అమ్మవారి కొలుపులు ముగింపు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో మహా నివేదనలు, నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారు శ్రీ విజయేశ్వరీ మహాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి, పెనుగొండ బాలకృష్ణమూర్తి, బుడ్డా సాయిబాబు, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



నిజాంపట్నం: గ్రామాల్లో ఆలయాలు నిర్మించుకోవడం వల్ల ప్రజలు పాడి పంటలు, అష్ట ఐశ్వర్యాలతో ఉంటారని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. కూచినపూడి గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ శ్రీరాముని జీవితం ప్రపంచ మానవావళికి ఆదర్శమన్నారు. శేషాచార్యులు బృందం శాస్త్రోక్తంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించింది. అనంతరం నల్లపాటి శివరామకృష్ణ ప్రసాద్ దంపతులు శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, పడమటి వెంకటేశ్వరరావు, బొలగాని విజయలక్ష్మి, లంకా కృష్ణకుమారి, కాశేపల్లి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బొర్రావారిపాలెంలో వేంచేసి ఉన్న అంకమ్మతల్లి ఆలయ 6వ వార్షికోత్సవాల్లో ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పాల్గొని, పూజలు నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, మోపిదేవి హరనాథబాబు, రేపల్లె మున్సిపల్ చైర్మన్ కట్టా మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వీర్లంకమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన వీర్లంకమ్మ విగ్రహం

కర్లపాలెం: పెద పులుగువారిపాలెంలోని చిన అక్కలవారి ఇలవేల్పు వీర్లంకమ్మ, పోతురాజు స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం కనుల పండువగా జరిగింది. గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ప్రతిష్ఠా మహోత్సవ పూజలు నాలుగు రోజులుగా భక్తిశ్రద్ధలతో జరిగాయి. వీర్లంకమ్మ, పోతురాజు విగ్రహాలను గ్రామోత్సవం చేసి, ప్రతిష్ఠించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఎమ్మెల్యే కోన రఘుపతి, గ్రామ సర్పంచ్ అక్కల శ్రీనివాస రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్‌రెడ్డి, బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ బాపట్ల నియోజకవర్గం ఇన్‌చార్జ్ వేగేశన నరేంద్రవర్మ, గ్రామ పెద్దలు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తడిచిన మొక్కజొన్న మద్దతు ధరకే కొనుగోలు



మొక్కజొన్న కండెలను పరిశీలిస్తున్న ఆర్డీవో పార్థసారథి



పసుపు పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి పి.జెన్నమ్మ

ఆర్డీవో జె.పార్థసారథి

నగరం: అకాల వర్షాలకు తడిచిన మొక్కజొన్నలను ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని రేపల్లె ఆర్డీఓ జె.పార్థసారథి పేర్కొన్నారు. పెద్దవరం గ్రామంలో మొక్కజొన్న పంటను ఆదివారం ఆర్డీవో పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంట ప్రస్తుతం పొలాల్లోనే ఉందన్నారు. మొక్కజొన్న కండెలు కల్లాల్లో ఉన్నాయని తెలిపారు. వర్షాలకు పంట తడవకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలకు మొక్కజొన్న తడిస్తే ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. తడిచిన మొక్కజొన్నను రైతులు తక్కువ రేటుకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేస్తారని, రైతులు అధైర్య పడాల్సిన పని లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఏవో కె.రమేష్‌బాబు, ఏఈఓ శ్రీనివాసరావు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది..

నిజాంపట్నం: పంట నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని తహసీల్దారు శిరీష కోరారు. పల్లపట్ల, కూచినపూడి గ్రామాల్లో ఆదివారం వ్యవసాయశాఖ అధికారి వాగోలు బుష్‌తో కలిసి ఆమె పర్యటించారు. అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శిరీష మాట్లాడుతూ పంట నష్ట పరిహారం అందించడంతో పాటు రంగు మారిన, మొలకెత్తిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏల ద్వారా పంటను నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వంశీ తదితరులు పాల్గొన్నారు.

పసుపు పంట పరిశీలన

వెల్లటూరు(భట్టిప్రోలు): అకాల వర్షాలకు కృష్ణానదీ పరీవాహక లంక గ్రామాల్లో వర్షాలకు తడిచిన పసుపు పంటను బాపట్ల జిల్లా ఉద్యాన శాఖాధికారి పి. జెన్నమ్మ ఆదివారం పరిశీలించారు. వెల్లటూరు, పెద పులివర్రు గ్రామాల్లోని కల్లాల్లో ఆరబెట్టిన పసుపు పంటను ఆమె సందర్శించి, పసుపు కొమ్ములు కుళ్లిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. మార్టూరు ఉద్యాన శాఖాధికారి బి.హనుమత్ నాయక్, వీహెచ్ఏలు టి.హిమ బిందు, కె.కవిత రైతులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

భట్టిప్రోలు: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కోరారు. ఆదివారం లంక గ్రామాల్లో రైతు సంఘం నాయకులు దెబ్బతిన్న పసుపు, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ప్రసాద్ మాట్లాడుతూ పంట దిగుబడి చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు రైతన్నలను కుంగదీశాయని పేర్కొన్నారు. సీపీఐ బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.బాలాజి, వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బి. శ్రీనివాసరావు, లంక గ్రామాల రైతులు పాల్గొన్నారు.

● మొక్కవోని శ్రమ



అకాల వర్షాలకు తడిచిన మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు రైతులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కల్లాల్లో కండెలు, గింజలు వర్షం భారిన పడకుండా టార్పాలిన్ పట్టలు కప్పి కాపాడుకుంటున్నారు. నీటిపాలైన గింజలను రైతులు మెరక ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రేఖలతో విరిచిన మొక్కజొన్న కండెల్లోకి నీరు చేరడంతో.. కండెలు మొలకలు వస్తాయన్న ఆందోళనతో పొత్తుల నుంచి రేఖలను తొలగించుకోవడం తలకుమించిన భారంగా మారింది. పెసర్లంక గ్రామంలో ఇలా కంకులకు రేఖలను తొలగిస్తూ.. పంటను కాపాడుకుంటున్నారు. – కొల్లూరు

విద్యార్థి అనిల్‌కు అభినందనలు

రేపల్లె: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటిన రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ విద్యార్థి కె.అనిల్(984)ను, కళాశాల అధ్యాపక బృందాన్ని ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ శేషగిరిబాబు ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థి అనిల్‌కు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. అధ్యాపక బృందం అందించిన రూ.20వేల నగదును కమిషనర్ శేషగిరిబాబు విద్యార్థికి అందజేశారు.

ఆలపాటి ధర్మారావుకు ఘన నివాళి



వేమూరు: మాజీ మంత్రి ఆలపాటి ధర్మారావు చిరస్మరణీయుడని పెరవలి సర్పంచ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దాది వెంకట లక్ష్మీరాజ్యం పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆలపాటి ధర్మారావు వర్ధంతి సందర్భంగా.. ఆయన విగ్రహానికి పూల దండలు వేసి, నివాళులర్పించారు. దాది సుబ్బారావు, తోటకూర అబరేష్ బాబు, తోటకూర క్రిష్ణకుమారి, దాసరి శ్రీనివాసరావు, గాజుల వాలేశ్వర రావు పాల్గొన్నారు.

ఆలపాటి ధర్మారావు సేవలు మరువులేనివి

మాజీ మంత్రి ఆలపాటి ధర్మారావు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేమని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు గుమ్మడి రవి రాజా పేర్కొన్నారు. ధర్మారావు వర్ధంతి సందర్భంగా ఇంటూరు గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ బట్టు మోషే, బీమవరపు సాంబిరెడ్డి, ఆవుతు ముత్తారెడ్డి, ఇంటూరు శ్రీహరి, ఏసుపాదం, కనపర్తి దానియేలు, పాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

భట్టిప్రోలు: మాటూరు రామారావు శాఖ గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి కలపాల సుభాష్ చంద్రబోస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కథ చెప్పడం, రాయడం, పుస్తక సమీక్ష, యోగా, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర విభాగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

విద్యుత్ వీల్‌చైర్ బహూకరణ

రేపల్లె: యలవర్తి కిరణ్ కుమార్, చైతన్య దంపతుల కుమారుడు సాయి సదాశివ లింగ వరప్రసాద్ జ్ఞాపకార్థం అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ సంఘం అధ్యక్షుడు జూనం మురళీకృష్ణకు రూ.1లక్ష విలువ చేసే ఎలక్ట్రికల్ వీల్‌చైర్‌ను ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ తమ కుమారుడి జ్ఞాపకార్థం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సంఘం సభ్యులు కృష్ణా, మేకా ఉమా మహేశ్వరరావు, రామకృష్ణ, గౌతమ బుద్ధ, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి మంత్రి అభినందన



విద్యార్థిని శ్రీలక్ష్మికి స్వీట్ తినిపిస్తున్న మంత్రి నాగార్జున

భట్టిప్రోలు: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో భట్టిప్రోలు సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థిని బొందలపాటి శ్రీలక్ష్మి ఉత్తమ మార్కులు సాధించడంతో ఆదివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ఆశీర్వదించారు. శ్రీలక్ష్మి తల్లిదండ్రులు బొందలపాటి నాగయ్య, రాజేశ్వరీలను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, వేమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, చుండూరు మండల కన్వీనర్ గాదె శివరామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మాతంగి రత్నకుమార్, కనపర్తి మోహన్‌రావు, చంటి, మోదుకూరి హరిబాబు పాల్గొన్నారు.

అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



వడ్డెర కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. పట్టణంలోని 13వ వార్డు వడ్డెర కాలనీలో రూ.20లక్షల ఎంపీ నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి గతంలో కోరారని, వారి విన్నపాన్ని దృష్టిలో ఉంచుకుని ఎంపీ నిధులు కేటాయించినట్లు ఆయన చెప్పారు. మున్సిపల్ సాధారణ నిధులతో పాటు ప్రభుత్వం నుంచి అదనపు నిధులు మంజూరు చేయించి అన్ని హంగులతో కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని పూర్తి చేయటం జరుగుతుందని తెలిపారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, మాజీ కౌన్సిలర్ చెన్ను లక్ష్మణరావు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కార్పొరేషన్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రేపల్లె రూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా అరవపల్లి పంచాయతీ రైతు మిత్ర గ్రూపునకు మంజూరైన ట్రాక్టర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రైతులకు ఖరీఫ్‌కు ముందుగా పెట్టుబడి సాయం, వ్యవసాయ పనిముట్లపై రాయితీలను అందిస్తూ ప్రభుత్వం చేయూతనందిస్తోందన్నారు. వ్యవసాయం దండగా అంటూ నాడు చంద్రబాబు రైతులను విస్మరిస్తే రైతే దేశానికి వెన్నెముక అని గ్రహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలతో రైతులను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఉపయోగకరంగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వమే కితాబునివ్వటం గర్వకారణమన్నారు. బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, సర్పంచ్ లోయా బాబూనాంచారయ్య, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నేటి యువతకు 'అల్లూరి' స్ఫూర్తి



అల్లూరి విగ్రహానికి నేతల నివాళి



సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పించిన క్షత్రియులు



భట్టిప్రోలులో అల్లూరి విగ్రహానికి నివాళి

పిట్టలవానిపాలెం: నేటి యువతరానికి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి ప్రదాత అని క్షత్రియ సేవా సంఘం సభ్యులు అల్లూరి శివరామరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఐ ల్యాండు సెంటరులో ఆదివారం విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 92వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శివరామరాజు మాట్లాడారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులపై ప్రత్యక్ష సాయుధ పోరుకు తెరలేపి, తెలుగు జాతి పౌరుషాన్ని ప్రపంచానికి చాటిన విప్లవ జ్యోతి అల్లూరి అని కొనియాడారు. అల్లూరి విగ్రహం వద్ద కొబ్బరి కాయలు కొట్టి, స్వీట్లు పంచిపెట్టారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బొలగాని సుబ్బారావు వైఎస్సార్, మంతెన వెంకట్రాజు విగ్రహాలకు నివాళులర్పించారు. పార్టీ నాయకులు బొలగాని సుబ్బారావు, రమేష్, మున్నం సుబ్బారెడ్డి, అల్లూరి శివరామరాజు, మదనమోహనరాజు, దేగల రవిరెడ్డి, వేగేశన రామకృష్ణంరాజు తదితరులున్నారు.

అల్లూరి పోరాట పటిమ ఆదర్శం

కర్లపాలెం: మణ్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శమని క్షత్రియ పెద్దలు తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో కర్లపాలెం పాలకేంద్రం వద్ద ఆయన విగ్రహానికి ఆదివారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పెద్దలు, యువకులు తదితరులు ఉన్నారు.

మన్యం వీరుడికి నివాళి

భట్టిప్రోలు: అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆదివారం భట్టిప్రోలు పీహెచ్‌సీ ఎదుట ఆయన విగ్రహానికి వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. విగ్రహ దాత తోటకూర మోహన్‌రావును సన్మానించారు. కమిటీ నిర్వాహకులు బండారు శ్రీనివాసరావు, జంజనం హేమ శంకర రావు, చందలూరి రామకోటేశ్వరరావు, క్రాప రవికుమార్, సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, రావూరి సత్యన్నారాయణ మూర్తి, బొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

మంటల్లో సగ భాగం కాలిపోయిన యువకుడు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో నిదురిస్తున్న ఓ యువకుడు మంటల్లో సగభాగం కాలిపోయాడు. వివరాల మేరకు.. ఆదివారం రాత్రి అమర్తలూరి సౌదామణికి చెందిన పూరింట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంట్లో ఆమె సోదరుడు కత్తి గాబ్రియేల్, కుమారుడు రవికుమార్(చంటి) నిద్రిస్తున్నారు. మంటల్లో చంటి చిక్కుకుపోయి సగ భాగం కాలిపోయాడు. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో ఇంట్లో నుంచి అరుపులు రావడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమయ్యి.. మంటల్లో చిక్కుకున్న చంటిని బయటకు తీసుకువచ్చారు. వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. మంటల్లో చిక్కుకున్న చంటిని మెరుగైన చికిత్స కోసం తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించారు. సౌదామణి ఇంట్లోని సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. రేపల్లె అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్యకు ఘన నివాళి



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నేతల నివాళి

బాపట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య భావితరాలకు ఆదర్శనీయులని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు పేర్కొన్నారు. దామోదరం సంజీవయ్య 52వ వర్ధంతి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐటీపీఎల్, బీహెచ్ఈఎల్ వంటి కంపెనీలతో పాటు వ్యవసాయ అభివృద్ధికి గాజులదిన్నె, వంశధార ప్రాజెక్టులను నిర్మించి, నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఆనాటి బడ్జెట్లో రూ.77 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నాయకులు పటాన్ రాజేష్, సెక్రెటరీ శీలం సాగర్, మాజీ కౌన్సిలర్ రాంబాబు, శంకర్, డి.రవి, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక తదితరులు పాల్గొన్నారు.

నేడు దుకాణాల అద్దె వేలం

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న దుకాణాలు, మార్కెట్ ఆశీలు అద్దె వేలం పాట సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పంచాయతీ పాలకవర్గ సర్వసభ్య సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.